క్లుప్తంగా

వాహనాలకు రేపు వేలం

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) పరిధిలోని గ్రామాల్లో సారా, గంజాయి తదితర కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 24న బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు స్థానిక ఎస్‌ఈబీ సీఐ ఎల్. చిరంజీవి గురువారం తెలిపారు. ప్రత్తిపాడు ఎస్‌ఈబీ కార్యాలయంలో 15 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలకు ఉదయం 8 గంటలకు వేలం నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనే వారు ఆధార్ కార్డు నకలుతో పాటు ధరావత్తు సొమ్ము జమ చేయాలన్నారు. వేలంలో వాహనం దక్కించుకున్న వారు పాడిన మొత్తం సొమ్ముతో పాటు జీఎస్టీ సొమ్మును కూడా వెంటనే చెల్లించాలన్నారు. మరిన్నీ వివరాలకు 94417 48547, 99895 66535 నంబర్లను సంప్రదించాలని కోరారు.

తహసీల్దార్‌గా విజయ్‌కుమార్‌రాజు



కోటనందూరు: మండల తహసీల్దార్‌గా జి.విజయ్ కుమార్‌రాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణా జిల్లా నందివాడ తహసీల్దార్‌గా పని చేస్తున్న ఆయన ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన ఇంతియాజ్ బదిలీపై జగ్గంపేట వెళ్లారు. నూతన తహసీల్దార్‌కు వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

యర్రవరంలో బీజేపీ ప్రజాపోరు యాత్ర



యర్రవరంలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఏలేశ్వరం: మండలంలోని యర్రవరంలో గురువారం బీజేపీ నాయకులు ప్రజాపోరుయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కొల్లాశ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామంలో ప్రత్యేక వాహనంతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ హయాంలో ప్రపంచ వ్యాప్తంగా మన దేశానికి ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల కన్వీనర్ కురాకుల రాజా, జిల్లా సభ్యుడు గట్టెం వెంకటరమణ, మండల కన్వీనర్ కురాకుల రాజా, వెలుగూరి హరేరామ్, ఏనుగు ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

గోకవరంలో..

గోకవరం: గ్రామంలో గురువారం బీజేపీ నాయకులు ప్రజాపోరుయాత్ర కార్యక్రమం నిర్వహించారు. దేవీచౌక్ సెంటర్, ఆంజనేయస్వామి గుడి సెంటర్, ప్రధాన రహదారి మీదుగా వీధుల్లో పర్యటించి కేంద్రప్రభుత్వ పథకాలపై ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ దాట్ల కృష్ణవర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టా మంగరాజు, మండలాధ్యక్షుడు సత్తి వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఇనకోటి బాపన్నదొర, నాయకులు బత్తుల వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల వద్ద అన్నసమారాధనలు

గోకవరం: గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయాల వద్ద గురువారం అన్నసమారాధనలు నిర్వహించారు. భీష్మ ఏకాదశి, ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పోస్టల్ కార్యాలయం వద్ద వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద బత్తులవారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యాన అన్నదానం చేశారు. సుమారు 2 వేల మంది భక్తుల పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. అ లాగే ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగ్గంపేట: సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు గురువారం తెలిపారు. గోకవరం రోడ్డులోని టీచర్స్ కాలనీ, నెహ్రూ కాలనీ, ఎంప్లాయిస్ కాలనీ, జగనన్న కాలనీ, శ్రీరామ్‌నగర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సారా బట్టీపై పోలీసుల దాడి

కొత్తపల్లి: సారా బట్టీపై దాడి చేసి 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు గురువారం స్థానిక పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని రమణక్కపేట శివారు కేఎస్‌ఈజెడ్ సమీపంలోని జీడిమామిడి తోటల్లో సారా తయారు చేస్తున్నారని సమాచారం రావడంతో ఎస్సై స్వామి నాయుడు తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, సారా తయారీకి సిద్ధం చేసిన 300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు పోలీసులు తెలిపారు.

సుపరిపాలనే ప్రభుత్వ ధ్యేయం



పారుపాకలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు



గిడజాంలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేసిన వరుపుల సుబ్బారావు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు
- పారుపాకలో గడప గడపకూ మన ప్రభుత్వం

రౌతులపూడి: గ్రామాల అభివృద్ధితో పాటు సుపరిపాలనే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని పారుపాకలో గురువారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థతో పరిపాలన ప్రజలకు మరింత చేరువైందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

వైఎస్సార్ సీపీలోకి 200 కుటుంబాలు

మండలంలోని గిడజాం, పి.చామవరం గ్రామాలకు చెందిన 200 టీడీపీ కుటుంబాలు గురువారం వరుపుల సుబ్బారావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. గిడజాంలో సొసైటీ డైరెక్టర్ బండారు బైరాగీ ఆధ్వర్యంలో 150 కుటుంబాలు, పి.చామవరంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు కామిరెడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 50 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి వరుపుల సుబ్బారావు కండువాలు వేసి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో శంఖవరం ఎంపీపీ పర్వత రాజబాబు, జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, పార్టీ నాయకుడు వాసిరెడ్డి జమీలు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, సొసైటీ ప్రెసిడెంట్ రుత్తల సత్తిబాబు, సర్పంచ్ పక్కుర్తి లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు జయబాబు, గాడి నూకరాజేశ్వరరావు, చందక వెంకటరమణ పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి అండగా నిలవండి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- కాండ్రేగులలో ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం

జగ్గంపేట: అన్ని వర్గాల ప్రజలకూ పథకాలు అందిస్తున్న సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం పిలుపునిచ్చారు. మండలంలోని కాండ్రేగుల గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులతో గురువారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా సొమ్ములు జమచేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం, పార్టీ యువ నాయకుడు తోట రాంజీ, సీనియర్ నాయకుడు అత్తులూరి సాయిబాబు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి, పార్టీ నేతలు తుల రాము, తోట అయ్యన్న, నకిరెడ్డి నాగేశ్వరరావు, అడబాల సుబ్బారాయుడు, గెడ్డం వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో వలంటీర్ల పాత్ర కీలకం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు
- రౌతులపూడిలో వలంటీర్లకు సత్కారం



రౌతులపూడిలో వలంటీర్లను సత్కరించిన వరుపుల సుబ్బారావు

రౌతులపూడి: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో గ్రామ వలంటీర్ల పాత్ర ఎంతో కీలకమని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం వైఎస్సార్ సీపీ నేత వాసిరెడ్డి జమీలు అధ్యక్షతన వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. వరుపుల సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొని సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులు పొందిన వలంటీర్లను శాలువాలతో సత్కరించి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని వలంటీర్లకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్, జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, సొసైటీ ప్రెసిడెంట్ రుత్తల సత్తిబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోలుపర్తి తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలపై పోలీసుల దాడి

తొండంగి: మండలంలోని పైడికొండ పంచాయతీ ఆనూరు శివారులో కోడి పందేల శిబిరంపై దాడి చేసి ఎనిమిది మందిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్సై బి.వినయ్ ప్రతాప్ గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... ఆనూరులో కోడి పందేలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు కోడిపుంజులు, రూ.1650 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దొరబాబు

గండేపల్లి: గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని ఎంపీపీ చలగళ్ల దొరబాబు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ దొరబాబు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనకు అధికారులు కృషి చేయాలన్నారు. విద్యుత్, వ్యవసాయం, రక్షిత తాగునీరు, విద్య తదితర శాఖల పని తీరుపై సమీక్షించారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. గ్రామాల్లో సమస్యలను పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, గండేపల్లి సర్పంచ్ రుత్తల లలిత, ఎంపీటీసీ చెల్లూరి రాంబాబు, పార్టీ నేత గొల్లేపల్లి రవి, ఎంపీడీఓ హనుమంతరావు, తహసీల్దార్ చిరంజీవి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

సరస్వతీ నమోస్తుతే...



రత్నగిరిపై సరస్వతీ పూజ నిర్వహిస్తున్న పండితులు



విద్యార్థులకు సత్యకలాలు, కంకణాలు పంపిణీ చేస్తున్న ఈఓ రామచంద్రమోహన్

- రత్నగిరిపై వైభవంగా సరస్వతీ పూజ
- విద్యార్థులకు సత్యకలాలు, సత్య కంకణాల పంపిణీ

అన్నవరం: సరస్వతీ నమస్తుభ్యం.. వరదే కామరూపిణి...విద్యారంభం కరిష్యామి.. సిద్ధిర్భవతు మేసదా.. అంటూ విద్యార్థులు ఆలపించిన సరస్వతీదేవి శ్లోకంతో రత్నగిరిపై సత్యదేవుని ఆలయం మార్మోగింది. ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కోరుతూ గురువారం ఉదయం రత్నగిరిపై సరస్వతీ పూజ నిర్వహించారు. ఉదయం 9 గంటలకు స్వామివారి నిత్యకల్యాణ మండపంలో దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి సరస్వతీ పూజను ప్రారంభించారు. పండితులు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లకు, సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. సరస్వతీదేవి వద్ద కలాలు, రక్షలు ఉంచి పూజలు చేశారు. అనంతరం విద్యార్థులకు సత్యకలాలు, సత్య రక్ష (కంకణాలు) ఈఓ రామచంద్రమోహన్ పంపిణీ చేశారు. దేవస్థానం విద్యాసంస్థలతో పాటు అన్నవరం పరిసర గ్రామాల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వేదపండితులు గంగాధరబట్ల గంగబాబు, యనమండ్ర ఘనపాఠి, ముష్టి పురుషోత్తం, ఇంద్రగంటి నర్సింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యం, నాగాభట్ల కామేశ్వరశర్మ, ఛామర్తి కన్నబాబు తదితరులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఏఈఓ డీవీఎస్ కృష్ణారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జగన్ పాలన



తునిలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి

తుని: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. మన మున్సిపాలిటీ–మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక 19వ వార్డులో కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఆమె పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల రూపంలో అందించిన లబ్ధిని ప్రజలకు వివరించారు. వార్డు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ పామర్తి మహేష్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, వార్డు కౌన్సిలర్ ఆచంట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

130 యూనిట్ల రక్తం సేకరణ



తునిలో రక్తదానం చేస్తున్న యువకులు

తుని: స్థానిక రోటరీ క్లబ్ ఆవరణలో గురువారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రోటరీ, రోటరాక్ట్, ఇన్నర్‌వీల్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో యువకులు, విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. స్థానిక ఏరియా ఆసుపత్రి, మదర్ బ్లడ్ బ్యాంకుల సిబ్బంది సంయుక్తంగా 130 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. రక్తం అవసరమైన వారికి చేయూతనివ్వడమే లక్ష్యంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటిండెంట్ స్వప్న, రోటరీ క్లబ్ అధ్యక్షుడు కేఎస్‌ఎల్‌ఎస్ వర్మ, కార్యదర్శి కె.కిషోర్‌రెడ్డి, డాక్టర్లు హరికృష్ణ, నాగిరెడ్డి, రోటరీ, రోటరాక్ట్, ఇన్నర్‌వీల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పట్టపగలే విద్యుత్ వెలుగులు



ఏలేశ్వరంలో పగలే వెలుగుతున్న వీధిలైట్

ఏలేశ్వరం: పట్టణంలో పగలు, రాత్రి తేడా లేకుండా నిరంతరం వీధి దీపాలు వెలుగుతున్నాయి. విద్యుత్‌ను పొదుపు చేయమని చేప్పే అధికారులే వృథా చేయడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని షిర్డీ నగర్, పెద్దవీధి, తోటవీధి తదితర ప్రాంతాల్లో ప్రతిరోజూ నిరంతరం విద్యుత్ వీధి దీపాలు వెలుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠ



బొద్దవరంలో ధ్వజస్తంభం శిఖరాన్ని దర్శిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

కోటనందూరు: మండలంలోని బొద్దవరంలో శ్రీరాముని ధ్వజస్తంభం ప్రతిష్ఠ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా స్వామివారు, ధ్వజస్తంభాన్ని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో బాసిల్లాలని ఆకాంక్షించారు. తొలుత మంత్రి దాడిశెట్టి రాజాకు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు, గ్రామ సర్పంచ్ వేగి లక్ష్మి, లోవ దేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, ఏఎంసీ చైర్మన్ సుర్ల రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు వేగి అప్పలనాయుడు, యల్లపు సత్యనారాయణ, దొడ్డి బాబ్జీ, నల్లమిల్లి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- పెరిక కార్పొరేషన్ చైర్‌పర్సన్ పురుషోత్తం గంగాభవాని
- డ్వాక్రా మహిళలకు ఆసరా నమూనా చెక్కు పంపిణీ



తునిలో మహిళలకు ఆసరా నమూనా చెక్కు అందిస్తున్న గంగాభవాని, నాయకులు

తుని రూరల్: మహిళల ఆర్థికాభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర పెరిక కార్పొరేషన్ చైర్‌పర్సన్ పురుషోత్తం గంగాభవాని, ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అన్నారు. తుని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో గురువారం వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు నాలుగో విడత ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. రూ.16.08 కోట్ల విలువైన నమూనా చెక్కును మండల మహిళా సమాఖ్య సభ్యులకు గంగాభవానీ, ఎంపీపీ రాము అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా నాలుగు విడతల్లో తుని మండలంలో 1826 మహిళా సంఘాలకు రూ.64 కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు. గతంలో చంద్రబాబు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని చెప్పి మహిళలను మోసం చేశారన్నారు. సీఎం జగన్ చెప్పారంటే చేస్తారని, చంద్రబాబు చెప్పాడంటే అది అబద్ధమే అన్నారు. మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తూనే రాజకీయ ప్రాధాన్యం కల్పించారన్నారు. స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవుల్లోనూ మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డిని అడ్డుకునేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ తదితర పార్టీలన్నీ ఏకమవుతున్నాయన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ వంటి నాయకుల మోసపూరిత మాటలను ప్రజలు నమ్మరన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి సీఎంగా జగన్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు, ఆత్మ కమిటీ చైర్మన్ చోద్రాజు రాంబాబు రాజు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు దుంగల నాగేశ్వరరావు, మండల మాజీ అధ్యక్షుడు పోతల రమణ, ఏపీఎం వై.సత్తిబాబు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



కత్తిపూడి హైస్కూల్‌లో నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న నాగార్జున యాదవ్

శంఖవరం: మనబడి నాడు–నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేస్తున్నట్టు ఏపీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నాగార్జున యాదవ్ అన్నారు. మండలంలోని కత్తిపూడి జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న నాడు–నేడు పనులను గురువారం ఆయన పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆర్వో వాటర్ ప్లాంట్ కండిషన్‌ను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పాఠశాల గదుల్లో ఫ్యాన్లు సక్రమంగా తిరిగేలా చూడాలన్నారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎస్‌వీ రమణ, హెచ్‌ఎం ఆకుల శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాఘవేంద్ర, జేఈ తేజ తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభం

గోకవరం: గుమ్మళ్లదొడ్డి గ్రామంలో ప్రసిద్ధిగాంచిన మహాలక్ష్మీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి అస్సాగో ప్రైవేటు లిమిటెడ్ ఫ్యాక్టరీ ఆర్వో ప్లాంట్‌ను వితరణ చేసింది. ఈ ప్లాంట్‌ను గురువారం అస్సాగో మేనేజింగ్ డైరెక్టర్ అశీష్ గుర్నానీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటోందన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పరిసర ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అస్సాగో సిబ్బంది కల్నల్ శ్రీనివాసరావు, సునీల్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, సమ్మెటి రాంబాబు, శరకణం మురళీకృష్ణ, నరాలశెట్టి నర్సయ్య, తోలేటి రాంప్రసాద్, ఆలయ ధర్మకర్త పులగం కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.